సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 7 । జూలై । 2024



వైభవుడికి సుప్రభాత సేవ

విశాఖ: వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు.



రథయాత్రకు వేళాయె...

జగన్నాథుని ఉత్సవాలకు వేళయింది. జిల్లా అంతటా ఆదివారం రథయాత్రతో వేడుకలు ప్రారంభమవుతాయి. 8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.3/26.5

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

ప్రతి ఉపాధ్యాయుడికీ శిక్షణ అవసరం

- ఆర్జేడీ విజయభాస్కర్



ట్రైనీ సెంటర్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయభాస్కర్

చోడవరం: ఉపాధ్యాయులంతా ఎప్పటికప్పుడు బోధనలో జరుగుతున్న మార్పులపై శిక్షణ పొందడం అవసరమని విశాఖపట్నం రీజనల్ డైరెక్టర్ విజయభాస్కర్ తెలిపారు. చోడవరం క్లస్టర్‌లో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల శిబిరాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ గురించి ఆయన పర్యవేక్షులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను హింసించకుండా బోధన ఎలా చేయాలనే అంశాలపై ఉపాధ్యాయులకు ఆయన పలు సూచనలు చేశారు. . ప్రతి విద్యార్థిలో అంతర్గత శక్తి ఉంటుందని, దానిని ఉపాధ్యాయుడు గమనించి ఆ దిశగా బోధన చేయాలన్నారు. కోర్స్ డైరెక్టర్ ఐ.వి.రామిరెడ్డి, ఎంఈవోలు జయలక్ష్మి, సింహాచలం, సిఆర్‌పీలు, ట్రైనీలు పాల్గొన్నారు.

కోస్టల్ సెక్యూరిటీపై అధ్యయనం

మంగమారిపేటలో ట్రైనీ ఐపీఎస్‌ల బృందం



మాట్లాడుతున్న మెరైన్ డీఎస్పీ కాళిదాసు

కొమ్మాది (విశాఖ): ఫీల్డ్ అండ్ ప్రాక్టికల్‌లో భాగంగా కోస్టల్ సెక్యూరిటీ అధ్యయనానికి 76 మంది ట్రైనీ ఐపీఎస్‌లు శనివారం జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట తీర ప్రాంతంలో పర్యటించారు. మెరైన్ డీఎస్పీ ఎస్.కాళిదాసు ఆధ్వర్యంలో వారు మత్స్యకారులతో సమావేశమయ్యారు. మత్స్యకారుల జీవన విధానాలు, తుపాను సమయంలో వారు ఎదుర్కొనే సమస్యలపై అధ్యయనం చేశారు. కోస్టల్ సెక్యూరిటీకి సంబంధించి విధివిధానాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీమిలి ఎస్‌డీవో లావణ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మత్స్యకారులకు అందే ప్రయోజనాలు, చేపల వేటాడే విధానం ట్రైనీ ఐపీఎస్‌లకు వివరించారు. మెరైన్ సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐలు వి. శ్రీనివాసరావు, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా రవీంద్ర బాధ్యతలు



రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్యదర్శి దాట్ల కీర్తి

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా వి.రవీంద్ర శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆయన సంస్థ జాయింట్ కమిషనర్‌గా వ్యవహరించారు. ఇటీవలే జిల్లా కలెక్టర్, మెట్రోపాలిటన్ కమిషనర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జాయింట్ కమిషనర్‌గా ఉన్న రవీంద్రకు అదనపు బాధ్యతలు ఇచ్చి కమిషనర్‌గా నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు తీసుకోగా సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, ఇతర విభాగాధిపతులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కేవైసీ అప్‌డేట్ పేరిట టోకరా

ఉక్కునగరం: కేవైసీ అప్‌డేట్ పేరిట వచ్చిన లింక్‌ను తెరిచిన కొంత మంది తమ బ్యాంక్ ఖాతాల్లో డబ్బు మాయం కావడంతో లబోదిబోమంటున్నారు. రెండు రోజులుగా పలువురు మొబైల్స్‌కు యూనియన్ బ్యాంక్ కేవైసీ అప్‌డేట్.ఏపీకే పేరిట లింక్ మేసేజ్‌లు వస్తున్నాయి. కేవైసీ అప్‌డేట్ చేయాలనే ఉద్దేశంతో చాలా మంది ఈ లింక్ తెరిచారు. దీంతో వారి ఖాతాల్లో ఉన్న నగదు మాయమైంది. ఒకరిది రూ.20 వేలు పోగా, మరొకరి ఖాతాలో రూ.40 వేలు మాయమైంది. గరిష్టంగా ఒకరిది రూ.లక్ష పోయింది. దీంతో బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వారు ఈ కేసులను సైబర్ క్రైం స్టేషన్‌కు బదిలీ చేశారు. తెలియని లింక్‌లను తెరవొద్దని విస్తృతంగా ప్రచారం జరుగుతున్నా.. ప్రజలు అప్రమత్తంగా లేకుండా మోసాల్లో చిక్కుకోవడం పట్ల బ్యాంక్ అధికారులు విచారం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల నుంచి ఎటువంటి కాల్స్, మెసేజీలు రావని, ఏమైనా అధికారిక సమాచారం ఉంటే ఆయా బ్యాంకుల అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే పొందుపరుస్తామని తెలిపారు.

వందేళ్ల నేస్తాలు

- విశాఖ పరిధిలో పురాతన వృక్షాల గుర్తింపునకు శ్రీకారం
- డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్న ఇంటాక్
- వందేళ్లకు పైబడిన చెట్లు 20 వేలకు పైగా ఉంటాయని అంచనా
- ఇప్పటికే 800 వృక్షాలు గుర్తించిన ఇంటాక్ ప్రతినిధులు
- ఈ చెట్లే పర్యావరణ పరిరక్షణ నేస్తాలుగా ప్రచారం



వారసత్వ వృక్షాలపై అధ్యయనం చేస్తున్న ఇంటాక్ బృందం

సాక్షి, విశాఖపట్నం: వారసత్వ వృక్షాలను ప్రజలకు అనుసంధానం చేయడం ద్వారా చెట్ల పట్ల ఆప్యాయత, అనుబంధాన్ని పెంపొందించేందుకు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్(ఇంటాక్) నడుం బిగించింది. నగరంలో ఉన్న శతాబ్ది వృక్షాల వారసత్వ సంపదని గుర్తించి, పరిరక్షించేందుకు ప్రత్యేక డాక్యుమెంట్ సిద్ధం చేస్తోంది. విశాఖ నగర పరిధిలో వందేళ్లకు పైబడిన వృక్షాలు 20 వేలకు పైగా ఉన్నట్లు అంచనా వేసింది. ఇప్పటివరకు సుమారు 800 వృక్షాలను గుర్తించింది. వారసత్వ వృక్షాల పరిరక్షణకు 1975లో చెట్ల రక్షణ, సంరక్షణ చట్టం ఏర్పాటు చేశారు. చెట్ల సంరక్షణకు సంబంధించి అన్ని నిర్ణయాలను తీసుకునే స్థానిక పౌర సంస్థలతో కలిసి నగర పాలక సంస్థలు సిద్ధం కావాలని చట్టంలో పేర్కొన్నారు. కానీ.. ఆ పరిస్థితులు నగరంలో ఎక్కడా కనిపించకపోవడంతో ఇంటాక్ సంస్థ ఆ బాధ్యతను తన భుజస్కంధాలపై కెత్తుకుంది.

వారసత్వ వృక్షాలంటే..?

1975 చట్టం ప్రకారం 50 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న ఏ చెట్టునైనా వారసత్వ వృక్షంగా నిర్వచించాలి. ఈ క్రమంలో చెట్టు చారిత్రక ప్రాముఖ్యతను కూడా పరిగణించాలి. స్థానిక అథారిటీ వారసత్వ చెట్ల గణనతో పాటు ప్రతి ఐదేళ్లకు ఒకసారి చెట్ల గణనను నిర్వహించాలి. కానీ నగరంలో ఎక్కడా అది అమలవ్వడం లేదు.

విశాఖలో 20 వేలకు పైగా..

ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన మాజీ పర్యావరణ, వృక్షశాస్త్ర ప్రొఫెసర్ల నేతృత్వంలో వైజాగ్‌లోని పర్యావరణవేత్తలు నగర పరిధిలో 20 వేల వారసత్వ వృక్షాలు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి ఇంటాక్ ప్రతినిధులు నగరంలో అధ్యయనం ప్రారంభించి వారసత్వ వృక్షాల డాక్యుమెంట్ రూపొందిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 800 పురాతన వృక్షాలను గుర్తించారు. ఈ వారసత్వ వృక్షాలు చారిత్రక, పర్యావరణ ప్రాముఖ్యతను కలిగి ఉన్నట్లు డాక్యుమెంట్‌లో పొందుపరుస్తున్నారు. శతాబ్దాలుగా వైజాగ్ అభివృద్ధిలో భాగస్వామ్యమవుతున్న ప్రతి చెట్టును పరిరక్షించాలన్నది వీరి ప్రధాన ఉద్దేశం.

కాపాడితేనే మనుగడ

వారసత్వ వృక్షాలు నేల సారవంతం పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయి. వృక్షజాలం, జంతుజాలాల జీవిత కాలాన్ని పెంచడమేకాకుండా.. భూగర్భ జల వనరులు పెంపొందించడంలోనూ ముఖ్య భూమిక వహించి ప్రజలకు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చుతాయి. ఈ పురాతన వృక్షాలు మొత్తం పర్యావరణ వ్యవస్థకు బూస్టర్‌లుగా కార్బన్ డయాక్సైడ్ నుంచి రక్షించే రక్షకులుగా వ్యవహరిస్తున్నాయి. ఈ చెట్లను సంరక్షించడం, వాటిని తదుపరి తరానికి అందించడం చాలా కీలకమని ఇంటాక్ బృందం చెబుతోంది. హెరిటేజ్ ట్రీ వాక్ పేరుతో ఇంటాక్ చాప్టర్ కన్వీనర్ డా.రాజశేఖర్ రెడ్డి, కో-కన్వీనర్ డా.సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఎడ్వర్డ్ పాల్, జయశ్రీ హట్టంగిడి, మయాంక్ కుమారి డియో, వెంకటరమణారెడ్డి, తన్మయ్ ముఖోపాధ్యాయ, వివేక్ రాథోడ్ తదితర సభ్యులు, పర్యావరణ వేత్తల సమక్షంలో ఈ డాక్యుమెంట్ తయారవుతోంది. మరో 15 రోజుల్లో తమ పరిశోధన పూర్తి చేసి వారసత్వ వృక్షాలకు సంబంధించిన సమగ్ర డాక్యుమెంట్ సిద్ధం చేసి భావితరాలకు అందించనుంది.





నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న శతాబ్ది వృక్షాలు

భావితరాలకు అందించేందుకు..



50 ఏళ్లు పైబడిన చెట్టు భూ సారవంతంతో పాటు భూగర్భ జల వనరుల్ని పెద్ద ఎత్తున సంరక్షిస్తుంది. ఒక భారీ మర్రి చెట్టు తన జీవిత కాలంలో 5 వేల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను సేకరిస్తుంది. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి అని ప్రచారం చేస్తారు. కానీ.. ప్రస్తుతం ఉన్న ఈ తరహా వారసత్వ వృక్షాన్ని ఒకదాన్ని సంరక్షిస్తే వందల మొక్కలు నాటిన ఫలితం ఉంటుంది. అందుకే ఈ తరహా హెరిటేజ్ ట్రీ ప్రొటెక్షన్ కోసం వర్క్‌షాప్‌లు నిర్వహించాలని భావిస్తున్నాం. పర్యావరణ వ్యవస్థ స్థిరత్వం కోసం పని చేసే వారసత్వ వృక్ష సంపదను విశాఖ ప్రజలంతా కలిసికట్టుగా కాపాడాలని కోరుతున్నాం.

– ప్రొ.డా.కామేశ్వరరావు, ఇంటాక్ ప్రతినిధి

సింహాచలం కొండపై 250 ఏళ్ల నాటి చెట్టు



ఇంటాక్ ప్రతినిధుల పరిశోధనల్లో శతాబ్దాల నాటి చెట్లను గుర్తిస్తున్నారు. ఇవి విశాఖ పర్యావరణ పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు డాక్యుమెంట్‌లో స్పష్టం చేశారు. నగర పరిధిలో అనేక చెట్లు 200 సంవత్సరాలకు పైగా వయసున్నవి ఉన్నాయి. సింహాచలం కొండపై ఉన్న ఒక మర్రి చెట్టు వయసు దాదాపు 250 ఏళ్లు ఉంటుందని గుర్తించారు. వాల్తేరు డీఆర్ఎం కార్యాలయం సమీపంలో ఉన్న చెట్టు 130 ఏళ్లనాటిది. ఆంధ్ర విశ్వవిద్యాలయం సిరిపురం క్వార్టర్స్‌లో 200 ఏళ్లనాటి మర్రి చెట్టు, రావిచెట్టు, మామిడి చెట్టు ఉన్నట్లు గుర్తించారు. ఇలా నగరంలో వివిధ ప్రాంతాల్లో శతాబ్ది వృక్షాలున్నట్లు ఇంటాక్ పరిశీలనలో బయటపడుతున్నాయి.

రేపు వైఎస్సార్ జయంతి

మునగపాక: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు సోమవారం ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన సాక్షితో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా రాజన్న విగ్రహాలకు ఈ నెల 8న పెద్దఎత్తున నివాళులు అర్పించడంతోపాటు అవకాశం ఉన్న మేర సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్టీ శ్రేణులు జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రసాద్ కోరారు.

బ్లడ్ క్యాన్సర్ రోగికి మగ బిడ్డ



బిడ్డకు జన్మనిచ్చిన మహిళను అభినందిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట (విశాఖ): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న మహిళ సిజేరియన్ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చింది. కేజీహెచ్‌లో పలు విభాగాల వైద్యులు సమన్వయంతో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించారు. తల్లి, బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన 24 ఏళ్ల అరుణకుమారి రెండో గర్భం దాల్చింది. ఏడో నెలలో రక్త పరీక్షలు చేయగా తీవ్రమైన బ్లడ్‌క్యాన్సర్ అని శ్రీకాకుళంలో రిమ్స్ ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. వెంటనే కేజీహెచ్‌కు ఈ కేసును రిఫర్ చేశారు. కేజీహెచ్‌లోని మెడికల్ అంకాలజీ విభాగంలోని క్యాన్సర్ వైద్య నిపుణులు అరుణకుమారికి ఆరోగ్యశ్రీ ద్వారా సకాలంలో వైద్య సేవలు అందించారు. అరుణకుమారికి అనీమియా(రక్తహీనత), తక్కువ ప్లేట్‌లెట్స్ ఉన్నట్లు కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప తెలిపారు. శనివారం ప్రసూతి వైద్యులు సిజేరియన్ చేయడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇటు వంటి రక్తకణాల క్యాన్సర్‌లో తల్లి, బిడ్డ సురక్షితంగా కోలుకోవడం చాలా అరుదైన సంఘటన అని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. శనివారం తల్లి, బిడ్డను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకొని అభినందించారు. అరుణకుమారి వైద్యం కోసం గైనకాలజిస్టు డాక్టర్ సోమని, డాక్టర్ రవీంద్ర, డాక్టర్ షర్మిల, నర్సింగ్ సిబ్బంది తదితరులు ఎంతో సహకారం అందించారని కేజీహెచ్ అంకాలజి విభాగాధిపతి డాక్టర్ శిల్పా తెలిపారు.

తల్లి పేరుతో మొక్క నాటండి



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ సిబ్బంది, అధికారులు

ఏయూక్యాంపస్: ఏయూలో జాతీయ సేవా పథకం అధికారులు శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఏక్ పేడ్ మాతాకే నామ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ జాతీయ సేవ పథకం ప్రతి యూనిట్ ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. మొక్కల వలన ప్రాణ వాయువు లభిస్తుందని, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు.

ప్రతీ వ్యక్తి తల్లి రుణం తీర్చుకోవాలని భావిస్తారని, అలా భావించే వారంతా తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. తల్లి మనకు ప్రాణం ఇస్తుందని, దీనిని రక్షిస్తే మనకు నిత్యం ప్రాణవాయువును మొక్కలు అందిస్తాయన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవ పథకం ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ అర్చన, వై.అనసూయాదేవి, జాతీయ సేవా పథక కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిరాతకం

- బాలికను వేధించడంతో పోక్సో కేసు నమోదు
- జైలుకు పంపారని కక్ష కట్టిన యువకుడు
- బెయిల్‌పై వచ్చి కొడవలితో హతమార్చిన వైనం



దర్శిని (ఫైల్)



రక్తపు మడుగులో దర్శిని మృతదేహం



నిందితుడు సురేశ్ (ఫైల్)

రాంబిల్లి: ఒక మృగాడి పైశాచికానికి బాలిక బలైంది. పోలీస్ యంత్రాంగం బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తికి సంబంధించిన వివరాలను వెల్లడించి బాలిక కుటుంబీకుల్ని అప్రమత్తం చేస్తే ఇటువంటి దురాగతం జరిగి ఉండేది కాదు. దీనికి సంబంధించిన వివరాలు.. కశింకోట మండలానికి చెందిన జె.సురేశ్ అదే ప్రాంతానికి చెందిన బద్ది దర్శిని(14)ని వేధించే వాడని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు ఇవ్వడంతో పోక్సో కేసు నమోదు చేసి జైలుకి పంపారు. బాలికను వాళ్ల అమ్మమ్మ ఇంటి వద్దకు పంపించి చదివిస్తున్నారు. రాంబిల్లి మండలం కొప్పిగొండుపాలెంలో ఉంటూ రాంబిల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దర్శిని శనివారం యధావిధిగా పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకుంది. బెయిల్‌పై వచ్చి అప్పటికే మాటు వేసి ఉన్న సురేశ్ వేట కొడవలితో బాలిక మెడ నరికి హతమార్చాడు. తనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని కక్ష పెంచుకున్న సురేశ్ ఈ దురాగతానికి పాల్పడ్డాడని భావిస్తున్నారు. డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నర్సింగరావు, ఎస్ఐ మన్మధరావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారు కావడంతో అతని కోసం గాలిస్తున్నారు. ఈ ఘటనతో రాంబిల్లి మండలంతోపాటు ఉమ్మడి విశాఖ జిల్లా ఉలిక్కిపడింది.

ఇసుక డిపోల వద్ద నిరంతర నిఘా

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశం
- సీసీ కెమెరాలు, షిఫ్టులవారీగా బందోబస్తు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



నక్కపల్లిలో ఇసుక డిపోను తనిఖీ చేసిన జేసీ జాహ్నవి, పక్కన ఆర్డీవో జయరాం

నక్కపల్లి: ఇసుక డిపోల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేసి అక్కడ నిల్వ ఉన్న ఇసుక పక్కదారి పట్టకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆదేశించారు. శనివారం ఆమె నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఇసుక డిపోను సందర్శించారు. గత ప్రభుత్వం ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు డిపోలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నదుల్లో లభ్యమయ్యే ఇసుకను ప్రైవేటు ఏజెన్సీల ద్వారా విక్రయించి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరే చర్యలు చేపట్టింది. సార్వత్రిక ఎన్నికలు జరిగి రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇసుక విక్రయాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. నక్కపల్లి డిపోలో సుమారు 26 వేల టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. ఈ ఇసుకను ప్రభుత్వంలో కొంతమంది పెద్దల సహకారంతో అక్రమంగా తరలించుకుపోవడానికి ఇసుక మాఫియా పథకం పన్నింది. 15 రోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా 30 లారీల్లో ఇసుకను తరలించుకుపోయారు. దీనిపై అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో తాజాగా ఈనెల 1వ తేదీ రాత్రి కొంతమంది జేసీబీల సాయంతో డిపో వద్ద మార్గాలు ఏర్పాటు చేసి ఇసుక తరలించుకుపోవడానికి ప్రయత్నించారు. బహిరంగ మార్కెట్లో సుమారు రూ.5 కోట్లు విలువైన ఈ ఇసుకను తరలించుకుపోవడానికి లారీల్లో జేసీబీలను తీసుకుని వచ్చిన విషయం తెలుసుకున్న స్థానికులు, ట్రాక్టర్ యజమానులు అడ్డుకున్నారు. ఈ విషయం పోలీసులకు తెలిసి వారు ఇసుక డిపో వద్దకు చేరుకోవడంతో వారంతా అక్కడ నుంచి పారిపోయారు. అప్పటినుంచి పోలీసులు ఈ డిపో వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బాగోతం ఈనెల 2వ తేదీన 'పడగ విప్పిన ఇసుక మాఫియా' శీర్షికన సాక్షి దినపత్రికలో వెలువడింది. ఈ కథనంపై స్పందించిన జాయింట్ కలెక్టర్ జాహ్నవి ఆర్డీవో జయరాం, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, డీపీవో శిరీషారాణి, మైన్స్ ఏడి సుబ్బారాయుడు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఎస్‌పి శైలజారాణిలతో కలసి శనివారం నక్కపల్లి డిపోను సందర్శించారు. ఈ డిపో వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఇసుక తరలిపోకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మండలపరిషత్ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. షిఫ్టుల వారీగా బందోబస్తు కొనసాగించాలన్నారు. అన్ని శాఖల సిబ్బందితో బందోబస్తు ఉండాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సీఐ అప్పన్న, విజయ్‌కుమార్‌లు ఉన్నారు.

ఇసుక యార్డుల్లో సీసీ కెమెరాలు

నర్సీపట్నం: ఈ నెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక పంపిణీ ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ జాహ్నవి తెలిపారు. శనివారం నర్సీపట్నం మండలంలో గబ్బాడ ఇసుక రీచ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నక్కపల్లి, గబ్బాడ ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయన్నారు. ఒక ఆధార్ కార్డుకు 20 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. యార్డులకు ఇసుక రాజమండ్రి నుంచి వస్తున్నందున రవాణా ఖర్చులను బేరీజు వేసి రేటు నిర్ణయించటం జరుగుతుందన్నారు. ఇసుక యార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, వచ్చి వెళ్లే వెహికల్స్‌పై నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కొనుక్కొని తీసుకువెళ్లిన ఇసుక సక్రమంగా వినియోగమవుతుందా లేదా అని ర్యాండమ్‌గా చెక్ చేస్తామన్నారు. ఏ జిల్లా ఇసుక ఆ జిల్లాలోనే వినియోగించాలన్నారు. ఇక్కడ కొనుగోలు చేసి విశాఖపట్నం తీసుకువెళ్తామంటే కుదరదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ప్రభుత్వపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో హెచ్.వి.జయరాం పర్యవేక్షణలో ఇసుక యార్డుల నిర్వహణ కొనసాగుతుందన్నారు. ఆమె వెంట మైనింగ్ అధికారులు ఉన్నారు.

నిర్వాసితుల సమస్యపై దృష్టి పెట్టండి

కలెక్టర్‌కు హోంమంత్రి సూచన



హోంమంత్రిని కలిసిన కలెక్టర్

నక్కపల్లి: జిల్లాలో నిర్వాసితుల సమస్యలపై దృష్టి సారించాలని కలెక్టర్ విజయ కృష్ణన్‌కు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం విజయ కృష్ణన్ శనివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను ఆమె స్వగృహంలో కలిశారు. నక్కపల్లి క్రిష్ లేఅవుట్‌లో ఉన్న అనితతో బేటీ అయ్యారు. అనకాపల్లి కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ కృష్ణన్‌ను హోం మంత్రి అనిత అభినందించారు. ఈసందర్భంగా జిల్లాలో పలుసమస్యలపై వారిద్దరూ చర్చించారు. పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరం మండలంలోని రేవుపోలవరం, బంగారయ్యపేట,వాకపాడు ప్రాంతాల్లో కేంద్ర రక్షణ శాఖ నిర్మిస్తున్న ఎన్ఏవోబీకి సంబంధించి నిర్వాసితులు ఆందోళన చేస్తున్నారని మంత్రి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి ఏపీఐఐసీ రైతులనుంచి భూసేకరణ చేసిందని, ప్రభుత్వం సేకరించిన ఐదువేలఎకరాలకు నష్టపరిహారం చెల్లించారని కలెక్టర్‌కు వివరించారు.అయితే జిరాయితీ రైతులకు 2013 భూసేకరణ చట్టప్రకారం నష్టపరిహారం, ప్రత్యేక ప్యాకేజీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని రైతులు డి మాండ్ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వారికి, డీఫారం రైతులకు కూడా ప్యాకేజీ వర్తింపజేయాలంటూ ఆందోళన కొనసాగుతోందన్నారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. స్టార్టప్ ఏరియా గుర్తించారని, త్వరలో పరిశ్రమలు కూడా రానున్నాయని తెలిపారు. ఇక్కడ కూడా నిర్వాసితులు సమస్యలు డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టర్‌కు సూచించారు. తక్షణమే ఈ రెండు ప్రధాన సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కలెక్టర్ వెంట నర్సీపట్నం ఆర్డీవో జయరాం తదితరులు ఉన్నారు.

8 నుంచి ఉచితంగా ఇసుక సరఫరాకు చర్యలు

అనకాపల్లి: ఉచిత ఇసుక పంపిణీ విధానం, తదితర అంశాలపై విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక సరఫరా విధానం అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని, కలెక్టరు చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న ఇసుక నిల్వలను బట్టి ఆన్‌లైన్ విధానంలో వినియోగదారులకు ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ పద్ధతిలో సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక సరఫరా విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. ఇసుక రవాణాకు ఎటువంటి ఆటంకాలు ఏర్పడకుండా చూడాలన్నారు. జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక రవాణాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎం.జాహ్నవి, అదనపు ఎస్పీ విజయభాస్కర్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఆర్డీవో ఏజె.చిన్నికృష్ణ, భూగర్భ గనుల శాఖ సహాయ సంచాలకులు సుబ్బారాయుడు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముస్తాబైన జగన్నాథుడు
రథయాత్రకు వేళాయె...


చోడవరంలో బలభద్ర, సుభద్ర జగన్నాథుని విగ్రహాలకు రంగులు వేసి సిద్ధం చేసిన దృశ్యం


మాడుగులలో రంగులతో ముస్తాబైన జగన్నాథుని ఆలయం


యాత్రకు సిద్ధమైన జగన్నాథుని రథం

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో జగన్నాథ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలన్ని, రథాన్ని రంగులతో తీర్చిదిద్దారు. బలభద్ర, సుభద్ర, జగన్నాథుని విగ్రహాలను ఆలంకరించారు. మాడుగులలో అతి పురాతన దేవాలయాల్లో జగన్నాథుని ఆలయం ఒకటి. పూరీ ఆలయంలో జరిగే విధంగా ఈ ఆలయంలో ఏటా రథయాత్ర అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి రథం లాగేందుకు వందలాది మంది భక్తులు పోటీపడతారు. ఆదివారం నుంచి రథయాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి స్వామివారి రథయాత్రను నిర్వహిస్తారు. ఈ రథయాత్ర ప్రధాన ఆలయం నుంచి బయలుదేరి గవర వీధిలో ఏర్పాటు చేసిన ఇంద్రద్యుమ్న హాల్ వద్దకు చేరుతుంది. స్వామి అక్కడే కొలువు దీరి దశావతారాలలో భక్తులకు దర్శనమిస్తారు. తిరుగు రథయాత్ర ద్వారా ప్రధాన ఆలయానికి చేరుకోవడంతో జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు పూర్తవుతాయని, భక్తులు స్వామివారి అభిషేకాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ ప్రధాన అర్చకులు పండా నూకరాజు కోరారు.

చోడవరంలో ...

చోడవరం: జగన్నాథస్వామి రథయాత్ర, దశావతార దర్శన ఉత్సవాలను చోడవరంలో భారీగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 7వతేదీ నుంచి 18వ తేదీ వరకు జగన్నాథస్వామి ఉత్సవాలు నిర్వహించేందుకు చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉపాలయంగా ఉన్న శ్రీ జగన్నాథ స్వామి ఆలయాన్ని ముస్తాబుచేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారామాచార్యులు, రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలు వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి రథయాత్ర నిర్వహిస్తారు. మేళతాళాలు, దాససాహిత్య కోలాటక బృందాల కార్యక్రమాల మధ్య స్వామివారి ఆలయం నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర మెయిన్‌రోడ్డు మీదుగా వినాయకుడి గుడి, కోఆపరేటివ్ కాలనీ, శివాలయంవీధి, వెలమవీధి, చిన బజార్ మీదుగా బోళ్లవీధి రామాలయం ప్రాంగణానికి చేరుకుంటుంది. అక్కడ పది రోజుల పాటు స్వామివారు దశావతారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. 18వ తేదీన స్వామివారి తిరుగు రథయాత్ర జరుగుతుందని ఆలయ ప్రధానఅర్చకుడు సీతారామాచార్యులు, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్‌ఆఫీసర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని వారు చెప్పారు. ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

మొబైల్ ఫోన్ల దొంగ అరెస్టు


పట్టుబడిన సెల్‌ఫోన్ల దొంగతో జీఆర్పీ సీఐ ధనంజయనాయుడు

అనకాపల్లి : విశాఖ నుంచి అనకాపల్లి రైల్వే స్టేషన్లో తనిఖీలు నిర్వహిస్తుండగా సెల్‌ఫోన్ చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చడం జరిగిందని విశాఖ జీఆర్పీ సీఐ సీహెచ్.ధనుంజయనాయుడు, దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ కె.శాంతారాం అన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అనకాపల్లి రైల్వే స్టేషన్ తనిఖీలు నిర్వహిస్తుండగా తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన మేకల రాజును అదుపులోకి తీసుకొని, అతని నుంచి రూ. 2.65 లక్షల విలువ గల 27 మొబైల్ ఫోన్లు రికవరీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పాల్గొన్నారు.

చైతన్యవంతులమై ప్రజల పక్షాన..

- ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడదాం
- వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, కన్నడ హీరో సిద్దు


మాట్లాడుతున్న కన్నడ హీరో సిద్దు

రోలుగుంట: వైఎస్సార్‌సీపీ క్యాడర్ మళ్లీ చైతన్యవంతమై ప్రజల పక్షాన పోరాడాలని కన్నడ హీరో గొందు సిద్దు అన్నారు. శనివారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ కూటమి మూడు పార్టీలకు కలిపి 55 శాతం ఓట్లు వస్తే, వైఎస్సార్‌సీపీ వైపు 40 శాతం మంది ఉన్న విషయం మరిచిపోవద్దన్నారు. సూపర్ సిక్స్ పథకాల హామీలను అటకెక్కిస్తున్నారని, జూన్‌లో ఇవ్వాల్సిన రైతు భరోసా సాయానికి ఇంతవరకు అతీగతీ లేదని, వసతి దీవెన, విద్యా దీవెన, అమ్మ ఒడి వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. కూటమి నాయకులు వలంటీర్ వ్యవస్థపై రోజుకోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయాలు, వైఎస్సార్ విగ్రహాలను కూల్చడం, వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడులు చేసి హింసాత్మక కార్యకలాపాలకు దిగడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడదామన్నారు. మన నాయకుడు పార్టీలు, కులమతాలకతీతంగా అన్ని వర్గాలవారికి సంక్షేమ పథకాలు, సేవలు అందించే సంస్కారం నేర్పారని, అదే ఆశయంతో ముందుకు సాగుదామన్నారు. పార్టీ అభివృద్ధి కోసం తన సేవలు విస్తృతపరుస్తానని, ప్రియతమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆఖరి వరకు కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ నెల 8న జరగనున్న వైఎస్సార్ జయంతి రోజున తనకు తోచిన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

అనకాపల్లి : మండలంలో శంకరం జాతీయ రహదారిలో రోడ్డు దాటుతుండగా అదే గ్రామానికి చెందిన నాగమణిని గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్టు రూరల్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ సోంబాబు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

రామనామం రమ్యం..
భక్తజన పరవశం

- రామకోటి నామాలతో 350 పుస్తకాలు
- గౌరీపంచాయతన దేవస్థానంలో
- స్థూపం వద్ద సమర్పించిన భక్తులు


గౌరీపంచాయతన దేవస్థానంలో రామకోట స్థూపం వద్ద పుస్తకాలు వేస్తున్న భక్తులు

అనకాపల్లి : రామకోటి నామాలతో భక్తులు రాసిన 350 పుస్తకాలను స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవస్థానంలో శ్రీ రామకోట స్థూపం వద్ద ఆషాడ శుద్ధ పాడ్యమి శనివారం స్థూపంలో భక్తులు వేశారు. ఈ సందర్భంగా దేవస్థానం అధ్యక్షుడు కర్రి సన్యాసి నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది రామకోటి పుస్తకాలను కొణతాల శివకుమార్ భక్తులు రామకోటి నామాలతో రాసేందుకు ఉచితంగా ఉగాది రోజున అందజేయడం జరుగుతుందన్నా రు. భక్తులు రాసిన పుస్తకాలు ప్రతి ఏడాది స్థూపంలో వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు అంపోలు గోపాల్ కృష్ణశర్మ, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ , సభ్యులు ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ల ప్రసాద్ పాల్గొన్నారు.

'బడికొస్తా ' కార్యక్రమం జయప్రదం చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి వెంటకలక్ష్మమ్మ
- కుసుర్లపూడి హైస్కూలు ఆకస్మిక తనిఖీ


విద్యార్థుల విద్యాబుద్ధులు తెలుసుకుంటున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

రోలుగుంట : మండలం కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యాశాఖ చేపట్టిన 'బడికొస్తా' కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఎంతమంది చేరిందీ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సి బాధ్యత ఉపాధ్యాయులందరిపైనా ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ సంక్షేమాలు, ఉత్తమ బోధన, సాధిస్తున్న ఫలితాలను తెలియజెప్పి విద్యార్థులను బడిలో చేర్పించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి వారి విద్యాభ్యాసం తీరును తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించా రు. మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భోజనం రుచి, శుచిగా ఉండాలని, వేడి ఆహారంతో పాటు మరగకాచి చల్లార్చిన నీటిని విద్యార్థులకు అందించాలని భోజన నిర్వాహకులను ఆదేశించారు. రోజుకో ఉపాధ్యాయుడు వంటలను పర్యవేక్షించాలన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాల కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంవో వెంకటేశ్వర్రావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం విద్యావతి, ఉపాధ్యాయుడు సాంబశివరావు పాల్గొన్నారు.

విశాఖ పోర్టును సందర్శించిన ట్రైనీ ఐపీఎస్ బృందం

విశాఖ సిటీ: స్టడీ టూర్‌లో భాగంగా 21 మంది ట్రైనీ ఐపీఎస్‌ల బృందం శనివారం విశాఖ పోర్టు అథారిటీని సందర్శించింది. బృందానికి పోర్టులో మౌలిక సదుపాయాలు, ఆధునికీకరణ, యంత్రీకరణ, సరుకు హ్యాండ్లింగ్ పద్ధతులు, కవర్డ్ స్టోరేజ్ సౌకర్యాలు, సౌర శక్తి వ్యవస్థాపనలు, అంతర్గత, పారిశ్రామిక అవసరాల కోసం మలినాల శుద్ధి ప్లాంట్, స్మార్ట్ పోర్ట్ పద్ధతులు వంటి విషయాలను పోర్టు అధికారులు వివరించారు. పోర్టు కలాకలాపాలు, పోర్టు అనుసరిస్తున్న నవీన పద్ధతులపై అవగాహన కల్పించారు. పోర్టులో అతిథ్యం పట్ల ట్రైనీ ఐపీఎస్ బృందం పోర్టు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

కాఫీ రైతులకు..
వరుణ కటాక్షం

కాఫీ రైతులకు కొన్నేళ్లుగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. ఈ ఏడాది కూడా ముందుగా వర్షాలు కురవడంతో పూత కూడా నెలరోజులు ముందుగా వచ్చింది. దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీంతో కాఫీ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

- అనుకూలించిన వాతావరణం
- మేలు చేసిన ముందస్తు వర్షాలు
- ఈ ఏడాది ముందుగా వచ్చిన పూత
- పిందెతో కళకళ
- మంచి దిగుబడి వచ్చే అవకాశం


పాడేరు మండలం మోదాపల్లిలో విరగ్గాసిన కాఫీ కాయలు

సాక్షి,పాడేరు: ఏటా గిరిజనులకు మంచి ఆదాయం ఇస్తున్న కాఫీ సాగు ఈ ఏడాది కూడా సిరులు కురిపించనుంది. గత మూడేళ్లగా వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తున్నాయి. ముందస్తుగా కురుస్తున్న వర్షాలు ఎంతగానో ఉపయోపడుతున్నాయి. ఈ ఏడాది కూడా ఏప్రిల్, మే నెలల్లో కాఫీతోటలు విరబూశాయి. పిందెలతో కళకళలాడుతున్నాయి. అదేస్థాయిలో దిగుబడి ఉంటుందని కాఫీ రైతులు ఆశిస్తున్నారు.

పాడేరు డివిజన్‌లో..

జిల్లాలో పాడేరు డివిజన్‌లో మాత్రమే కాఫీ తోటలు ఉన్నాయి. 11 మండలాల పరిధిలో సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగు ఉండగా 1.50 లక్షల ఎకరాలు ఫలసాయం ఇస్తున్నాయి. సుమారు 12 వేల టన్నుల క్లీన్ కాఫీని గిరిజన రైతులు మార్కెటింగ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం జీసీసీ ఆధ్వర్యంలో కిలో రూ.280 ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేసింది. దీంతో మంచి దిగుబడి సాధించిన రైతులంతా అధిక ఆదాయం పొందారు.

గిట్టుబాటు ధరకు కొనుగోలు

పాడేరు ఐటీడీఏతో పాటు పలు ప్రైవేట్ సంస్థలు కూడా పండ్ల దశలోనే కాఫీ పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేశాయి. సుమారు 1.20 లక్షల గిరిజన కుటుంబాలు ఎకరాకు రూ.60 వేల వరకు ఆదాయం పొందారు. ఈ ఏడాది కూడా మంచి ఆదాయం వచ్చే పరిస్థితి ఉందని వారు ఆశిస్తున్నారు.

10వేల ఎకరాల్లో కాఫీ మొక్కల పునరుద్ధరణ

పాత తోటల్లో కాఫీ మొక్కల పునరుద్ధరణకు పాడేరు ఐటీడీఏ చర్యలు తీసుకుంది. జిల్లాలో 1.60 లక్షల ఎకరాల కాఫీ తోటల్లో పది వేల ఎకరాలు ఫలసాయం ఇవ్వడం లేదు. దీని ప్రభావం దిగుబడిపై చూపిస్తోంది. ఈ సమస్యను గుర్తించిన ఐటీడీఏ కాఫీ విభాగం అధికారులు ఆయా తోటల్లో ఆ ఎండిన మొక్కలను తొలగించి కొత్తగా కాఫీ మొక్కలు నాటేందుకు కసరత్తు మొదలు పెట్టారు.

మొక్కల పంపిణీకి నర్సరీలు

ఎకరానికి 2,500 చొప్పున కాఫీ మొక్కల పంపిణీకి నర్సరీలు ఏర్పాటుచేశారు. ఈ నెలాఖరు నుంచి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు తెలిపారు. మూడేళ్ల తరువాత ఈ మొక్కలు కూడా ఫలసాయం ఇవ్వడం ద్వారా దిగుబడులు పెరుగుతాయని వారు తెలిపారు.

సస్యరక్షణకు ప్రోత్సాహం



గిరిజనులు సాగు చేస్తున్న కాఫీ తోటల్లో ఈ ఏడాది కూడా కాపు అధికంగా ఉంది. అయితే పిందె, కాయ దశలో చీడపీడల బెడద లేకుండా సస్యరక్షణ చేపట్టేందుకు ఐటీడీఏ కాఫీ విభాగం అన్ని విధాలా ప్రోత్సహిస్తుంది. ఈఏడాది కూడా గిట్టుబాటు ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేసేందుకు జీసీసీ ముందుకు వస్తుంది. ఐటీడీఏ కూడా కాఫీపంటకు గిట్టుబాటు ధర లక్ష్యంగా పనిచేస్తుంది.

– అశోక్, కాఫీ విభాగం ఏడీ, ఐటీడీఏ, పాడేరు

9న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

మహారాణిపేట : మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈనెల 9న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 7 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకొని అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా పోర్టు గెస్టు హౌస్‌కు వెళ్తారు. కొంతసేపటి తరువాత సాగర్‌నగర్‌లోని సొంతింటికి వెళ్తారు. సాయంత్రం మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్‌లో శ్రీ కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొంటారు. 10వ తేదీన సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. 12న పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 13న ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ వెళ్తారు.

విద్యుత్‌షాక్‌తో గిరిజన యువకుడి మృతి

గూడెంకొత్తవీధి: మండలంలోని సిరిబాలలో శనివారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జోరంగి ట్రైసన్(22) అనే యువకుడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. వివరాలివి. సిరిబాల గ్రామా నికి చెందిన జోరంగి ట్రైసన్‌కు ఏడాదిన్నర కిందట వివాహం జరిగింది. ఈ యువకుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. విద్యుత్ పనులు చేయడంలో కొంత అను భవం ఉంది. గ్రామంలో వీధి లైట్లు వేసేందుకు శనివారం విద్యుత్తు స్తంభం ఎక్కాడు. ఎల్‌టీ లైన్ సరఫరా వచ్చే విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపి వీధి లైట్లు బిగిస్తుండగా అతడు ఎక్కిన నిచ్చెన హైటెన్షన్ (హెచ్‌టీ) విద్యు త్తు లైనుకు తగిలింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయాడు. అతన్ని స్థానికులు చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. ట్రైసన్‌కు భార్య, ఐదునెలల కుమారుడు ఉన్నారు. చింతపల్లి ఏఈ ప్రభాకరరావును సంప్రదించగా తమ విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేయడంతో ప్రమాదం జరిగినట్టు తెలిపారు.దీనిపై విచారణ చేపట్టినట్టు ఆయన చెప్పారు.

క్లుప్తంగా

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామం వద్ద కోడి పందాలు ఆడుతుండగా.. శనివారం ఆకస్మికంగా దాడి చేసి 8 మందిని పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఐ కె.రమేష్ బాబు తెలిపారు. 4 పందెం కోళ్లు, రూ.460 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన ర్యాలీ

కశింకోట: మండలంలోని మోసయ్యపేట, శివారు గోకివానిపాలెం గ్రామాల్లో శనివారం మలేరియా, డెంగ్యూ వ్యాధులపై తాళ్లపాలెం ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, వారానికి ఒక రోజు నీరు నిల్వ ఉండకుండా పాత్రలను ఖాళీ చేసి డ్రైడే పాటించాలని, దోమలు కుట్టకుండా తెరలు వినియోగించాలని సూచించారు. అనంతరం సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.ఎస్.ఆర్.కె.జి.నరసింహారావు, ఆర్.వెంకటలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త ఎం.శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు యూనిఫారాల సరఫరా


కశింకోట బాలికల హైస్కూల్ స్టాక్ పాయింట్‌లో విద్యార్థుల యూనిఫారాలు

కశింకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎట్టకేలకు యూనిఫారాలు చేరాయి. ఒక్కో విద్యార్థికి మూడు జతల చొప్పున అందించడానికి కశింకోట బాలికల హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి స్కూళ్ల వారీగా సరఫరా చేశారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు మొదటగా మండలంలోని 10 హైస్కూళ్లు, తేగాడలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాల, తాళ్లపాలెంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు యూనిఫారాలు అందజేసినట్లు ఎంఈవో-2 మూర్తి తెలిపారు. మిగిలిన 40 ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 8న పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. టెన్త్ క్లాస్‌కు పీఎస్ టెస్ట్ పుస్తకం, మిగిలిన తరగతులకు పాఠ్య పుస్తకాలు వచ్చిన మేరకు అందిస్తున్నామన్నారు. దీంతో ఇప్పటి వరకు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు విద్యా కానుక కిట్లు దాదాపుగా అందించినట్లేనని చెప్పారు. ఈ ఏడాది కొత్తగా అదనంగా చేరిన విద్యార్థుల విషయమై ఉన్నతాధికారులకు నివేదించి వారికి విద్యా కానుక కిట్లు వచ్చిన వెంటనే అందిస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 137 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,910	5,390
రెండో రకం	4,200	4,460
మూడోరకం	3,500	3,850

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
కల్కి2898 ఏడీ	:షిర్డిసాయి
కల్కి2898 ఏడీ	:పర్తిసాయి
మనమే	:వెంకటేశ్వర
రాజధాని రౌడీ	:శ్రీసత్య
కల్కి2898 ఏడీ	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-27 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఆహారమే ఔషధం


పరిశుభ్రమైన కూరగాయలు

- కాలం ఏదైనా పౌష్టికాహారంతోనే చక్కటి ఆరోగ్యం
- తాజా కూరగాయలు, పండ్లతో ఎంతో మేలు

అనకాపల్లి : మానవుని జీవనశైలిలో తాజా కూరగాయలు, పండ్లు ఆహారంలో భాగం చేసుకోవాలి. నిల్వ చేసిన ఆహార పదార్థాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి. తీపి పదార్థాలు తక్కువగాను.. పీచు పదార్థాలు ఎక్కువగాను తీసుకోవాలి. ప్రధానంగా పిజ్జాలు, బర్గర్లు, జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. డ్రింక్స్‌కు బదులు కొబ్బరి నీరు, మజ్జిగతో చేసే లస్సీ, బటర్ మిల్క్, చెరకు రసం తీసుకోవడం మంచిది.

నీరు, పాలకు ప్రాధాన్యమివ్వాలి..
కలుషితమైన తాగునీటిని తీసుకోవడం వల్ల మనిషి త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. కాలం ఏదైనా పరిశుభ్రమైన తాగునీటిని తీసుకోవాలి. వర్షా కాలంలో గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల వ్యాధుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కనీసం రోజుకు ఒక గ్లాసు పాలు తీసుకోవాలి. టీ, కాఫీ అలవాటు ఉన్నవారు రోజుకి ఒకసారి మాత్రమే తీసుకోవాలి. పరిమితికి మించి తాగడం మంచిది కాదు.

పప్పు ధాన్యాలు, పండ్లు..
ఆహారంలో నిత్యం పప్పు ధాన్యాలు, ఆకు కూరలు ఉండేలా చూసుకోవడం మంచిది. ఉదయం, సాయంత్రాల్లో డ్రైఫ్రూట్స్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. కాలానికి అనుగుణంగా ఫ్రూట్స్ తీసుకోవడం మంచిది. దీని వల్ల శరీరంలో రక్తప్రసరణ బాగుంటుంది. రోజుకు ఒక గుడ్డ తీసుకోవాలి. వయసును బట్టి వారానికి ఒకసారి చికెన్, మటన్ తీసుకోవడం మంచిది. మాంసాహారం ఎక్కువగా తీసుకోవడం వల్ల రోగాల బారినపడే అవకాశాలు ఉన్నాయి.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి..
భోజనం, టిఫిన్‌కు ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. దీని వల్ల ఆహారం రుచి తెలియడమే కాకుండా త్వరగా జీర్ణమవుతుంది. ఆహారం ఒకేసారి ఎక్కువగా తీసుకోకుండా మెల్లగా తీసుకుంటే మంచిది. జీర్ణ వ్యవస్థపై పెద్దగా భారం పడకుండా చూసుకోవాలి.

వ్యాధులకు చిట్కాలు...
వర్షాకాలంలో ఎక్కువగా జలుబు, దగ్గు వస్తాయి. ఇటువంటి సమస్యల నుంచి విముక్తి కలగాలంటే మిరియాలు, అల్లం, శొంఠి, పసుపు గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం వల్ల త్వరగా ఉపశమనం లభిస్తుంది.

ఆహారమే మన ఆరోగ్యాన్ని కాపాడుతుంది



మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యాన్ని కాపాడుతుంది. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు. ఆహారం తినే ముందు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాలన్ని బట్టి ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. రాత్రి 7 గంటలకు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ బాగుంటుంది.

– వాణి జగదీశ్వరి, వైద్యాధికారి, తుమ్మపాల పీహెచ్‌సీ

చక్కటి ఆరోగ్యానికి పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మానవుని జీవన శైలిలో అనేక మార్పులు వస్తున్నాయి. కోవిడ్ వంటి విపత్తుల నేపథ్యంలో మానవుని జీవనశైలి పూర్తిగా మార్పు చెందింది. కాలాలు.. రుతువులు కూడా మానవుని ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. వేసవి.. వర్షాకాలం.. శీతాకాలంలో వేర్వేరు వాతావరణాల వల్ల ఆరోగ్య పరిస్థితుల్లో మార్పు కనిపిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారం తినేవారు కాలాలు మారినా వ్యాధుల బారిన పడాల్సిన అవసరం ఉండదని వైద్యులు చెబుతున్నారు. అంతే కాకుండా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యాయామం, యోగా, ధ్యానం మంచిదని పేర్కొంటున్నారు.


ఆరోగ్యం అందించే బత్తాయి, ఆపిల్స్


పోషకాలను అందించే పైనాపిల్


ఆరోగ్య రక్షణలో చక్కటి పాత్ర పోషించే ద్రాక్ష

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రభుత్వం అందజేస్తున పౌష్టికాహారం అందజేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. తుమ్మపాలలోని గవరపేటవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. మరుగున పడిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను తక్షణమే మరమ్మతు చేయించి చిన్నారులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని తెలిపారు. అనంతరం అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశ వర్కర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు


అచ్చెర్లలో పెంపుడు కుక్కకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారి దయానా


కన్నూరుపాలెంలో కుక్కలకు టీకా వేస్తున్న పశు వైద్యాధికారి దయానా

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కశింకోట, కన్నూరుపాలెం, తాళ్లపాలెం పశు వైద్య కేంద్రాలు, అచ్చెర్లలోని రైతు సేవ కేంద్రం, అడ్డాం గ్రామంలో జూనోటిక్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని, లేదంటే వాటి ద్వారా మనుషులకు రేబిస్ వ్యాధి సోకుతుందని మండల పశు వైద్యాధికారి ఆల్ఫోన్సా జార్జ్ తెలిపారు. పెంపుడు కుక్కలను ఉత్సాహంగా పెంపకందారులు తీసుకొచ్చి టీకాలు వేయించారు. కన్నూరుపాలెం పశు వైద్యాధికారి డయానా, అచ్చెర్లలో జనసేన నాయకుడు దొడ్డి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు నిమ్మదల సన్యాసినాయుడు, నైనంశెట్టి రమణారావు, సిబ్బంది కరుణశ్రీ, ఈశ్వరరావు, రమేష్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి


కశింకోట హౌసింగ్ కాలనీలో జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


చోడవరం కాంప్లెక్స్ రోడ్డులో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంగరాజు

కశింకోట: కశింకోట హౌసింగ్ కాలనీలో శనివారం సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉప ప్రధానిగా, వివిధ శాఖల మంత్రులుగా పదవులు నిర్వర్తించి ఎనలేని సేవలందించారని, వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి పాటుపడ్డారని వక్తలు ప్రస్తుతించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, టీడీపీ నాయకులు వేగి వెంకటరావు, ఆడారి నరసింగరావు, తాకాశి కృష్ణ, త్రినాథ్, దళిత ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..
అనకాపల్లి: ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కె.మంగరాజు ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డు చోడవరం కాంప్లెక్స్ రహదారిలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ జగ్గజీన్ రామ్ జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో పలు సంఘాల నేతలు బొట్టా చిన్నయాదవ్, చిందాడ శంకరరావు, బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణతో సురక్షిత ప్రయాణం

అనకాపల్లి: వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు అన్నారు. స్థానిక నెహ్రూ చౌక్‌లో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ ధరించి వాహనం నడిపే వాహన చోదకులకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు నియమాలు పాటిస్తూ హెల్మెట్ ధరించి ప్రయాణం చెయ్యాలని కోరారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనచోదకుల భద్రతను దృష్టిలో పెట్టుకుని జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు.

ధ్యాన వేంకటేశ్వరుడికి విశేష పూజలు



కశింకోట: కశింకోటలోని వేంకటేశ్వర స్వామి ధ్యాన మందిరంలో ఆషాఢ శుద్ధ పాఢ్యమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిని వజ్ర కవచాలంకృతులను చేసి పూలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వెంకన్నను దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎరువుల దుకాణం తనిఖీ


ఎరువుల స్టోర్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కశింకోట : స్థానికంగా ఉన్న సత్యనారాయణ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయ స్టోర్‌ను శనివారం వ్యవసాయ శాఖ, విజిలెన్స్, ఎక్స్‌పెరిమెంట్ బృందం అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్, అమ్మకాలకు సంబంధించిన పుస్తకాలు పరిశీలించారు. ఈ బృందంలో రంపచోడవరం ఏడీఏ సీసీహెచ్‌వీ చౌదరి, ఐవోటీ ఎ.రవిప్రసాద్, ఏవో ఎం. స్వప్న పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ బాధ్యతల స్వీకరణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శ్రీ సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా దాడి వరాహ శివ సూర్యనారాయణ (బుజ్జి), డైరెక్టర్లుగా బొండా రమేష్, అనకాపల్లి మోహన్‌రావు, బొడ్డేడ వెంకట చలపతిరావు, కాండ్రేగుల వెంకట వీర అప్పారావు, బుగత కోటేశ్వరరావు, యల్లపల్లి ధనలక్ష్మి, బుద్ద లక్ష్మీ అప్పారావు, శరగడం కృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వీరిచే ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ, జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుధారాణి పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి


ఉత్తమ విద్యార్థులను మెమెంటోలతో సత్కరిస్తున్న సీఐ శంకరరావు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదవడం వల్ల ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని పట్టణ సీఐ జి.శంకరరావు అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే సమయంలో కాలాన్ని వృథా చేయడం వల్ల భవిష్యత్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యార్థులంతా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, ఐక్యవేదిక అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్, సభ్యులు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, బొడ్డు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా పండగలా వైఎస్సార్ జయంతి వేడుకలు


వైఎస్సార్‌సీపీ శ్రేణులతో వేడుకల ఏర్పాట్లపై మాట్లాడుతున్న మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను ఈ నెల 8న వాడవాడలా పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సకాలంలో అందించిన ఘనత మహానేత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో బలహీన వర్గాల రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాలని ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది ప్రజల ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడ పెతకంశెట్టి జోషఫ్, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పార్టీ కశింకోట మండల అధ్యక్షుడు మలసాల కిషోర్, సీనియర్ నాయకులు బొడ్డేడ శివ, కె.ఎం.నాయుడు, కడిమిశెట్టి సతీష్, నడిశెట్టి మధు, ఉగ్గిన అప్పారావు, పెంటకోట శ్రీను, మరిపల్లి శోభ, పద్మ, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథస్వామి ఉత్సవాలు


కశింకోట ఆలయంలో వేణుగోపాలస్వామి

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన ప్రసిద్ధ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం నుంచి పది రోజుల పాటు జగన్నాథ స్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా తొలి రోజు సాయంత్రం జగన్నాథస్వామి రథోత్సవాన్ని జరుగుతుందని చెప్పారు. అందంగా అలంకరించిన రథంపై సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వామిల విగ్రహాలను ఆసీనులు గావించి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించనున్నామన్నారు. ఆలయంలో ఉత్సవాల పది రోజుల పాటు దశావతారాల్లో స్వామిని అలంకరించి విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. ఈ నెల 17న తొలి ఏకాదశి పురస్కరించుకొని స్వామి తిరుగు రథోత్సవం నిర్వహిస్తామని, దీంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

రూ.9 లక్షలతో డ్రైనేజీ పనులకు శ్రీకారం


డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు

అనకాపల్లి : మండలంలో తుమ్మపాల గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం తుమ్మపాల గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9 లక్షల ఎంపీపీ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి చంటి, మాజీ సర్పంచ్ కర్రి బాబి, వార్డు మెంబర్లు రవ్వ భవానీ శ్రీను, జెర్రిపోతుల లక్ష్మి, తర్ర సత్యారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

10న దేశవ్యాప్త ధర్నా


జోనల్ కార్యాలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శంకరరావు తదితరులు

అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ పిలుపు మేరకు ఈనెల 10న దేశవ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు అన్నారు. స్థానిక జోనల్ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు భద్రత కల్పించాలని, వివిధ స్కీముల్లో పని చేస్తున్న ఆశ, అంగన్‌వాడీ, ఐకేపీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్లతో ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి అజయ్‌బాలరావు, శ్రీను, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

దోమ తెరలు వాడండి


రేబాకలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యురాలు నజరత్ సమీమ్, సిబ్బంది

అనకాపల్లి: వర్షాలు పడుతున్న సమయంలో గ్రామీణ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తుమ్మపాల సీహెచ్‌సీ వైద్యురాలు నజరత్ సమీమ్ సూచించారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని రేబాకలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోద వంటి వ్యాధులు బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దోమలు కుట్టకుండా ప్రజలు దోమ తెరలను వాడాలని సూచించారు. జ్వరం వచ్చిన రోగులు దగ్గరలోని ప్రభుత్వ వైద్యులను సంప్రదించి, సకాలంలో మందులు వాడటంతో ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. ఇంట్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.సంఘం, గాయత్రి, సుగుణమాల, పెంటారావు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

250 శునకాలకు వ్యాక్సిన్లు

అనకాపల్లి: జునోసిస్ డే సందర్భంగా స్థానిక గాంధీనగరం పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శనివారం 250 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేసినట్లు జిల్లా అధికారి బి.ప్రసాదరావు చెప్పారు. ఆది, సోమవారాలు కూడా ఆస్పత్రి ఆవరణలో ఉచితంగా వ్యాక్సిన్ వేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ ఏడీ బి.సౌజన్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



